ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టిన డ్రైవర్, క్లీనర్ అరెస్టు

మణికొండ: నార్సింగి ఔటర్‌రింగ్ రోడ్డుపై సోమవారం ఆర్మీ జవాన్ కునాల్‌ను ఢీకొట్టిన రెడీ మిక్స్ వాహనం డ్రైవర్, క్లీనర్‌ను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఔటర్‌రింగ్ రోడ్డుపై గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వేగంగా వెళ్తున్న రెడీమిక్స్ వాహనం రోడ్డు దాటుతున్న ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే వాహనం ఆపకుండా వెళ్లడంతో సీసీ కెమెరాల ఆధారంగా డ్రైవర్ రుక్నద్ అన్సారీ, మహ్మద్ ఆలం అన్సారీని గుర్తించి అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వారు తెలిపారు.

10న వరల్డ్ గ్లకోమా డే

గోల్కొండ: ఈ నెల 10న వరల్డ్ గ్లకోమా డే నిర్వహిస్తున్నామని మెహిదీపట్నంలోని సరోజినిదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.రాజలింగం తెలిపారు. ఇందులో భాగంగా మార్చి 10 నుంచి 16వ తేదీ వరకు గ్లకోమా వీక్ నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఈనెల 10న జరిగే వరల్డ్ గ్లకోమా అవేర్‌నెస్ వాక్‌లో పాల్గొంటారని ఆయన అన్నారు.

21న బల నిరూపణ సమావేశం

- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్
- బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లకు నోటీసులు అందించిన అధికారులు


బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అవిశ్వాస తీర్మానానికి ఈ నెల 21వ తేదీన సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కార్పొరేషన్ కమిషనర్, సిబ్బంది మంగళవారం కార్పొరేటర్లు నోటీసులు అందజేశారు. గత జనవరి 12వ తేదీన కార్పొరేషన్ పరిధిలోని 16 మంది కార్పొరేటర్లు మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ కలెక్టర్‌కు లేఖ అందించారు. అప్పటి నుంచి బల నిరూపణ సమావేశం కోసం వారు ఎదురుచూస్తున్నారు. కలెక్టర్, కార్పొరేషన్ అధికారులు కార్పొరేటర్ల సంతకాల సేకరణ తదితర వాటిని పరిశీలించి బల నిరూపణకు ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 16వ తేదీన బల నిరూపణ సమావేశాన్ని నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్న సమయంలో ఒక రోజు ముందుగా మేయర్ మహేందర్‌గౌడ్ కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారు. దీంతో అర్ధాంతరంగా అధికారులు నిలిపి వేశారు. నెల రోజుల్లో పూర్తి చేయాల్సిన అవిశ్వాస తీర్మానం నాలుగు రోజులు ఎక్కువగా ఉందని ఎలా నిర్వహిస్తారని దీనిని వెంటనే నిలిపేసి మరోసారి పరిశీలించి నెల రోజుల్లో తీర్మానం చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో కార్పొరేషన్ అధికారులు మరోసారి 16 మంది సభ్యుల సంతకం చేసిన ప్రతిపాది అవిశ్వాస తీర్మానం కాపీ, తదితర వివరాలను సమీకరించి పరిశీలించారు. కార్పొరేటర్ల సంతకాలను వ్యక్తిగతంగా ధృవీకరించి సరైనవిగా గుర్తించారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019లోని సెక్షన్ 37 ప్రకారం మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో మార్చి 21వ తేదీన ఉదయం 11 గంటలకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 16 మంది సభ్యులతో కూడిన కార్పొరేటర్లు అంతా సమావేశంలో పాల్గొని బల నిరూపణ చేపట్టాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కార్పొరేటర్లకు నోటీసులు జారీ చేశారు.

నీటి వ్యాపారాన్ని నివారిస్తాం


ఖానాపూర్‌లో నీటి సంప్‌లను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మణికొండ: గండిపేట మండలపరిధిలో వాల్టా చట్టానికి విరుద్ధంగా కొనసాగుతున్న నీటి వ్యాపారాన్ని పూర్తిగా నివారిస్తామని తహసీల్దార్ నర్రా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి, కోకాపేట, మణికొండ తదితర గ్రామాల్లో ఇష్టారాజ్యంగా బోర్లు వేసి ట్యాంకర్లకు నీటిని అమ్ముకుంటున్నారని దాంతో భూగర్భ జలాలు అడుగంటి ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు సోమ, మంగళవారాల్లో 23 నీటి వ్యాపార కేంద్రాలను గుర్తించి సంప్‌లు, బోర్లను తొలగించామన్నారు. ట్యాంకర్ల వారు రూ. 200లకు నీటిని కొని రూ. వెయ్యి నుంచి రూ. 2 వేల వరకు అమ్ముతున్నారన్నారు. మరోసారి ట్యాంకర్లకు నీటిని అమ్మితే వారిపై వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు విక్రంరెడ్డి, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిగా 'కొండా' ప్రకటనపై హర్షం


సంగీత

అత్తాపూర్: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ప్రకటించడం సంతోషంగా ఉందని అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతాగౌరీ శంకర్ అన్నారు. మంగళవారం అత్తాపూర్ డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి సమష్టి కృషితో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ అలాగే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మోసపూరిత హామీలను ఎండగడుతూ ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థిని ప్రకటించిందని, కానీ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించడంలో తర్జన భర్జన పడుతున్నారన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినులకు 'విష్' ఈ - కోర్సు

రాయదుర్గం: టాలెంట్ స్ప్రింట్, గూగుల్ సహకారంతో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదివే విద్యార్థినుల కోసం కొత్త కోర్సును నిర్వహిస్తోంది. 15 నెలల ఆన్‌లైన్ కోర్సును 'ది విమెన్ ఇంజినీర్స్ (డబ్ల్యూఈ) కోర్సును నిర్వహిస్తారు. 2019లో ప్రారంభించిన ఈ కోర్సులో ఇప్పటి వరకు 950 మంది మహిళా ఇంజినీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా మారి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈ కోర్సులో చేరిన వారికి 50 మంది మహిళా ఇంజినీరింగ్ విద్యార్థినులకు 100 శాతం స్కాలర్‌షిప్ అందించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గూగుల్ టెక్నికల్ ఫెలో ఉపాధ్యక్షుడు పార్థరంగనాథన్, టాలెంట్‌స్ప్రింట్ సీఈఓ, ఎండీ డాక్టర్ శంతనూపాల్ మాట్లాడుతూ.. విద్యార్థినులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుని భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా మార్చేందుకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. వివరాలకు wirh.talentrprint.com ను సందర్శించాలని నిర్వాహకులు తెలిపారు.

మొంగోడిబితో సీబీఐటీ ఒప్పందం


ఎంఓయూపై సంతకాలు చేసిన ఇరు సంస్థల ప్రతినిధులు

మణికొండ: విద్యార్థులకు ఉచితంగా పరిశ్రమ ధృవపత్రాల ప్రయోజనాల గురించి వివరించే మొంగోడిబీ సంస్థతో గండిపేటలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల ఒప్పందం చేసుకుంది. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఓయూలపై ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, మొంగోడిబి అకడమిక్ రిలేషన్స్ మేనేజర్ బసవ దర్శన్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు పరిశ్రమల పనితీరు, వారు జారీ చేసే ధృవపత్రాలతో ప్రయోజనాలను తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఇలాంటి కోర్సులలో నమోదు చేసుకున్న అధ్యాపకులు, విద్యార్థులకు ధృవీకరణ పరీక్షకు అయ్యే ఖర్చును మొంగోడిబి సంస్థ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీసీ సలహాదారు డాక్టర్ ఎస్‌ఎల్‌ఎస్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ ఎం. సుశాంత్, ఐటీ విభాగాధిపతి ఎ.రజినీకాంత్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శిరీష పాల్గొన్నారు.

స్థల కేటాయింపు బాధ్యత తీసుకుంటా


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పరిధిలో దళిత సమ్మేళన భవన నిర్మాణానికి స్థలం ఇప్పించే బాధ్యత తనదేనని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ హామీనిచ్చారు. రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ పలుగుచెరువు మహేశ్, ముఖ్య సలహాదారులు జీవన్ దాస్, వనం నర్సింహ మంగళవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేటా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు అధికారికంగా వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. దీంతో తమకు స్థలం ఇప్పించాలని వారు ఎమ్మెల్యేను కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. దళిత సమాజం అన్ని రంగాల్లో ఎదుగుతూ గొప్ప స్థాయిలో ఉండడం గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయిలో జయంతి ఉత్సవాలకు పోటీగా రాజేంద్రనగర్ సర్కిల్‌లోనూ నిర్వహించడం అభినందనీయమన్నారు. భవనం సమీకృత ఉపయోగ నిమిత్తం మహిళా, యువతకు ఉద్యోగ స్వయం ఉపాధి శిక్షణ కోసం తగిన ఏర్పాట్లు చేస్తానన్నారు. పేదల వివాహాలు, శుభకార్యాల కోసం దళిత సమ్మేళన భవనానికి స్థలం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పచ్చ శ్రీనివాస్, అనుముల జాన్‌పాల్, రగడంపల్లి శ్రావణ్, గోల్కొండ రాజు కుమార్, మంగళారం శ్రీనివాస్, మంత్రి చంద్రశేఖర్, పంబాల రాజు, ఎడ్లకాడి సూర్యం, ప్రవీణ్, పచ్చ నర్సింగ్ రావు, గొడుగు సంజీవ, పత్తిరాజు, ఆవునూరి బాబురావు, ప్రొఫెసర్ కొరని రవీందర్, మహేశ్, జంగయ్య, పెంటయ్య, నాని, వెంకటేశ్, పలువురు దళిత సమ్మేళనం పెద్దలు, యువకులు ఉన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కళాశాలల నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన కార్పొరేషన్ పరిధిలోని విశ్వభారతీ జూనియర్, మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక సదుపాయలు కల్పించేలా పాటుపడుతున్నామన్నారు. ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో రాష్ట్ర హోంగార్డుల సంఘం ప్రతినిధులు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ చైర్మన్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని రాష్ట్ర హోంగార్డులు మంగళవారం నగరంలో కలిశారు. రాష్ట్రంలో హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చేయాలని వారు కోరగా.. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. హోంగార్డుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ దయానంద్, ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రసాద్, మోహన్‌నాయక్, గోపాల్‌నాయక్ బొక్క గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు నీటిని సరఫరా చేయండి


జలమండలి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ శైలజ, మణికొండ క్వార్టర్స్ వాసులు

మణికొండ: వేసవికి ముందే బోర్లు వట్టిపోవడం, రోజు విడిచి రోజు వచ్చే నీరు కూడా సక్రమంగా రాకపోవడం, ఇష్టారాజ్యంగా బిల్లులు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పరిష్కరించాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, 16వ వార్డు కౌన్సిలర్ పి.శైలజావినోద్ కోరారు. ఈ మేరకు జలమండలి డివిజన్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పై నుంచి నీటి సరఫరా సమస్య తొలగిపోయిందని, స్థానికంగా లైన్‌మెన్లకు ఆదేశాలు ఇచ్చి సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు. అలాగే పెండింగ్ నీటి బిల్లులు దానికితోడు వాటికి వడ్డీలు పడుతుండడంతో అధికంగా కనిపిస్తున్నాయని, అలాంటి వారు తమ బిల్లులు తీసుకు వస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి, మణికొండ క్వార్టర్స్ అధ్యక్షుడు ఎ. నరేశ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలి

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర


భవానీనగర్‌లో ఆస్తిపన్ను వసూలు కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శరత్‌చంద్ర


కాళికానగర్‌లో పన్ను వసూళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర కోరారు. 14వ డివిజన్ భవానీనగర్, 19వ డివిజన్ సంధ్యానగర్ కాలనీ, 21వ డివిజన్‌లోని కాళీకానగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటా తిరుగుతూ ఆస్తిపన్ను వసూళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీవో నంబర్ 101 ప్రకారం బకాయిలపై అపరాధ రుసుం 90 శాతం మాఫీతో కేవలం 10 శాతం మాత్రమే చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పన్ను చెల్లింపుతో పాటు వారిని ప్రోత్సహించేందుకు వన్ టైమ్ స్కీమ్ కింద బకాయి ఉన్న వారికి 90 శాతం అపరాధ రుసుం మాఫీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ గృహ, వాణిజ్య వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'మనూ'లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ)లో మహిళా విద్యా విభాగం ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' మహిళా విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ అమీనా తహసీన్ తెలిపారు. ఈ సందర్భంగా 'మహిళల చట్టం, సాధికారత' అనే అంశంపై హైదరాబాద్‌లోని సిబయాసిస్ లా స్కూల్ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ సెల్ హెడ్ డాక్టర్ అనితాసేబుల్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. 'మనూ' లా స్కూల్ డీన్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజకీయశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్ పాల్గొంటారని వివరించారు.

కబ్జాకు గురైన చెరువును పునరుద్ధరించాలి

మాదాపూర్ సున్నం చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ


అధికారులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని సున్నంచెరువు పరిధిలోని ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లో సర్వేనెంబర్ 16లో భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలన్నారు. చెరువులో పూడ్చిన మట్టిని తీసివేసి చెరువును పరిరక్షించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇదే అదునుగా భావించి కబ్జాదారులు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి హద్దులను ఏర్పాటు చేయాలన్నారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇరిగేషన్ డీఈ నరేందర్, ఏఈ లక్ష్మీనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాజ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ ఆనంద్, ఏఈ రంజిత్, మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'సందేశ్‌ఖాళీ నిందితులను ఉరి తీయాలి'


నిందితుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

శంషాబాద్ రూరల్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సందేశ్‌ఖాళీ ఘటన నిందితులకు ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలో నిందితుల దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. జాతీయ రహదారిపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కె.సూర్యప్రకాశ్ పాల్గొని మాట్లాడారు. స్త్రీలను గౌరవించడం మన దేశ సంస్కృతి అని, మహిళా ముఖ్యమంత్రిగా ఉన్న పశ్చిమ బెంగాల్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంత ఎస్‌ఎఫ్‌డీ కో కన్వీనర్ ప్రదీప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అఖిల్, నగర కార్యదర్శి మనీశ్, భార్గవి, అనూష, రాజేశ్వరి, సంధ్య పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

శేరిలింగంపల్లి: ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని కంచె గచ్చిబౌలి సర్వే నెంబర్ 26 ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను మంగళవారం నేలమట్టం చేశారు. హెచ్‌సీయూ బస్ డిపో నుంచి బొటానికల్ గార్డెన్‌కు వెళ్లే రోడ్డులో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను ఆర్‌ఐ రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సాయంతో కూల్చివేశారు.

హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌ను కలిసిన ఉద్యోగులు

రాయదుర్గం: హెచ్‌సీయూలోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి బృందం హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్‌ను కలిశారు. హెచ్‌సీయూ పరిపాలనా భవనంలో మంగళవారం ఆయనను కలిసి సన్మానించారు. ఇటీవల ఆయనకు 'ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు' వచ్చిన సందర్భంగా అభినందించామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి శాంతయ్య, నాయకులు రాము, నర్సింహ్మ, ప్రేమ్‌కుమార్, తిరుమల్‌సింగ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులు ఉన్నారని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహమూద్ మాజహర్ ఉల్లా అన్నారు. మంగళవారం వివిధ విభాగాల వైద్యులతో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఆసుపత్రి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలందిస్తుందన్నారు. ఈఎన్‌టీ విభాగంతో పాటు డెంటల్ విభాగంలో కూడా అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారన్నారు. ఆసుపత్రిలో ఉన్న ఐసీయూ విభాగంలో అన్ని రకాల వైద్య సేవలు, పరికరాలు ఉన్నాయని పేర్కొన్నారు. కంటి విభాగం కూడా వైద్యులు ఉన్నారని ఆయన తెలిపారు. ఫిజీషియేన్‌లతో పాటు గైనకాలజిస్టు సేవాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే కౌసర్ కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌ఎంఓ డాక్టర్ వినయాక్‌రావు, ఏఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు, క్రిటికల్ కేర్ ఎమర్జెన్సీ డాక్టర్ అమీనా, ఫెథలాజిస్ట్ డాక్టర్ జబీన్, డెర్మటాలజిస్ట్ డాక్టర్ సుహాసిని, పిడియాట్రిక్ విభాగం డాక్టర్ మల్లికార్జున్, ఈఎన్‌టీ విభాగం డాక్టర్ రమ్య తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని యువకుడి దారుణ హత్య



అత్తాపూర్: గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎం పహాడి ప్రాంతంలో కత్తిపోట్లకు గురైన సుమారు 22 ఏళ్ల యువకుడి మృతదేహం పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16 నెలల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

మాదాపూర్: దేశంలో మొట్టమొదటి సారిగా మెడికవర్ ఉమెన్, చైల్డ్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేశారు. మాదాపూర్‌లోని ఆస్పత్రిలో 16 నెలల శిశువుకు మంగళవారం పీడియాట్రిక్ వైద్య విభాగం వైద్యులు సర్జరీ చేసి శిశువుకి ప్రాణాలను కాపాడారు. పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆశీస్‌సప్రె మాట్లాడుతూ.. టాంజానియాకు చెందిన 16 నెలల శిశువుకు అరుదైన పుట్టుకతో వచ్చిన వైకల్యంతో ఆసుపత్రికి వచ్చారు. గుండె, ఛాతీగోడ, ఉదర ప్రాంతాలను ప్రభావితం చేసే సంక్లిష్ట లోపాల పుట్టుకతో జన్మించిన పాపకు గుండె ఛాతీ కుహరం వెలుపల కొట్టుకోవడం, చర్మంతో మాత్రమే కప్పబడి ఉండటం లాంటి సమస్యలు ఉన్నాయన్నారు. శిశువుకు 14 గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్స చేశామన్నారు. సీవీటి సర్జన్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మధుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230